క్లుప్తంగా

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పూజలు అందుకున్న సాయిబాబా

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు పరిధి రామయోగి అగ్రహారంలో గల శ్రీ సద్గురు సేవాశ్రమం (శిర్డీ సాయి వృద్ధాశ్రమం) 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం శ్రీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ సాయి పారాయణ, సాయి నామ సంకీర్తన నిర్వహించారు. అదేవిధంగా వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 21న భక్తగాన సుధ శృతి లయచే పలు భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని, అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి మహాన్నదానం ఏర్పాటు చేయనున్నామని ఆశ్రమ వ్యవస్థాపక నిర్వహకులు యోగా రాజు తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, నాయకులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో గురువారం పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ లొడగల అప్పారావు శంకుస్థాపన చేశారు. ఎండాడ ఎస్సీ కాలనీలో 4 లైన్ల మెట్లు తొలగించి రోడ్డు నిర్మించేందుకు, ఎండాడ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి జీవీఎంసీ రూ.63 లక్షలు విడుదల చేసింది. ఆ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా కార్పొరేటర్ సొంత నిధులతో అంగన్‌వాడీ భవనం వద్ద టాయిలెట్లు నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 24 మందికి ఉద్యోగాలు

ఆనందపురం : మండలంలోని గిడిజాలలో ఉన్న సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 24 మందికి ఉద్యోగాలు లభించాయని ప్రిన్సిపాల్ ఎల్.మహేశ్వరరావు చెప్పారు. నాగార్జున ఫెర్టిలైజర్ కెమికల్ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించగా 200 మంది హాజరయ్యారు. వివిధ పరీక్షల అనంతరం 24 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారిని కరస్పాండెంట్ వేణుగోపాల్, అధ్యాపకులు అభినందించారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న రవి తదితరులు

మధురవాడ: మధురవాడ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. కమ్యూనిస్ట్ నాయకురాలు వాండ్రాసి అమ్మాజమ్మ జ్ఞాపకార్థం సంఘ పూర్వ అధ్యక్షుడు వాండ్రాసి రవికుమార్ పాదచారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.సూర్యప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు బెల్లాపు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అనధికార దుకాణాల తొలగింపు



తొలగింపు తర్వాత కూడా రోడ్డు మీదకు వచ్చిన సెల్ఫ్‌లపై పరదాలు కప్పుతున్న ఆక్రమణదారులు



మధురవాడ రైతు బజార్ రోడ్డులో అనధికార దుకాణాలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

- రైతు బజార్ రోడ్డులో పోలీసు రక్షణ మధ్య జీవీఎంసీ చర్యలు
- శాశ్వతంగా ఆక్రమణలు తొలగించాలని స్థానికుల డిమాండ్

మధురవాడ: కొమ్మాది జంక్షన్ సమీపంలో ఉన్న మధురవాడ రైతు బజార్ రోడ్డులో అనధికార, చిల్లర దుకాణాల తొలగింపు తంతులా మారుతోంది. గురువారం ఉదయం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పోలీసుల రక్షణ మధ్య అనధికార దుకాణాలు తొలగించారు. ఈ పనులను జెడ్సీ కనకమహాలక్ష్మి, ఇన్‌చార్జి ఏసీపీ రఘునాథరావు పర్యవేక్షించారు. మధురవాడ జాతీయ రహదారి నుంచి రైతు బజార్ వరకు సుమారు 15 అడుగుల వెడల్పు, 50 అడుగుల పొడవుతో ఉన్న సీసీ రోడ్డుకు ఇరువైపులా అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు ఇష్టానుసారంగా బడ్డీలు, చిల్లర దుకాణాలు ఏర్పాటు చేసేస్తున్నారు. దీంతో రోడ్డు చాలా ఇరుగ్గా మారడంతో ద్విచక్ర వాహనాలు కూడా లోపలికి వెళ్లే అవకాశం లేకుండా తయారైంది. నిత్యం ఉదయం వేళల్లో ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. రైతు బజార్‌కి కొత్త ఎస్టేట్ ఆఫీసర్ వచ్చేటప్పుడు జీవీఎంసీ అధికారులకు ఆక్రమణలపై ఫిర్యాదు ఇవ్వడం... జీవీఎంసీ సిబ్బంది ఒకటి రెండు రోజులు హడావుడి చేసిన తర్వాత ఇరువురూ మరచిపోవడంతో ఆక్రమణల తొలగింపు ఓ తంతులా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూమి ఆక్రమించి దుకాణాలు కట్టుకున్న వారు కూడా వాటి ముందు ఉన్న తాత్కాలిక దుకాణాలు, చిల్లర గంపలు తియ్యమంటే జీవీఎంసీ సిబ్బందిపై తిరగబడుతుండడం గమనార్హం. టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే ఆక్రమణలు పెరిగిపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అధ్వానంగా హైవే బస్ షెల్టర్లు



దుక్కవానిపాలెం వద్ద అధ్వానంగా ఉన్న బస్ షెల్టర్

ఆనందపురం : ప్రయాణికుల సౌకర్యార్థం వేలాది రూపాయలు వెచ్చించి జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న సర్వీసు రోడ్డు పక్కన నిర్మించిన బస్ షెల్టర్లు అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. దీంతో ఎవరికీ ఉపయోగపడడం లేదు. మండలంలోని గండిగుండం నుంచి పెద్దిపాలెం వరకూ ఇరువైపులా గల సర్వీసు రోడ్ల పక్కన గ్రామాలు ఉన్న ప్రాంతాల్లో సుమారు 20 వరకూ బస్ షెల్టర్లు నిర్మించారు. అంతర్జాతీయ ప్రమాణాలు అంటూ కేవలం నాలుగు అడుగుల వెడల్పు, పది అడుగుల పొడవుతో నిర్మించారు. కానీ ప్రయాణికులు సరిగా కూర్చోవడానికే అవకాశం లేకుండా ఉంది. బస్సులు, ఇతర రవాణా వాహనాల కోసం నిరీక్షించే ప్రయాణికులు ఎండకు ఎండి, వానకు తడుస్తున్నారు. ఏమాత్రం చినుకులు పడినా నిలువునా తడిచిపోతున్నారు. విపత్కర పరిస్థితిలో ఏమాత్రం తలదాచుకోవడానికి అవకాశం లేదు. అలాగే వాటి నిర్వహణను కూడా గాలికి వదిలేయడంతో సగానికి పైగా షెల్టర్లు మతిస్థిమితం లేనివారికి ఆవాసంగా మారాయి. పలు షెల్టర్లు ఇప్పటికే శిథిలంకాగా నిలబడడానికే అవకాశం లేకుండా ఉంది. కొన్ని షెల్టర్లను నివాస ప్రాంతాలకు దూరంగా నిర్మించారు. దీంతో చాలా షెల్టర్లను ప్రయాణికులు వినియోగించడం మానేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్లు ప్రయాణికులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గోతుల రోడ్డుతో అవస్థలు



వంతెన వద్ద గోతులు పడిన రోడ్డు

పద్మనాభం: పద్మనాభం పోలీస్ స్టేషన్ నుంచి గోస్తనీ నది వంతెన వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులమయమైంది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై విజయనగరం, సింహాచలం వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు గోతులమయం కావడంతో ద్విచక్ర వాహన చోదకులు వాటిలో పడి గాయాలపాలవుతున్నారు. ఈ గోతులను తాత్కాలికంగా పూడ్చుతున్నప్పటికీ అనతి కాలంలోనే మళ్లీ గుతుకులమయం అవుతున్నాయి. గోతులను శాశ్వత ప్రాతిపదికన పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డిగ్రీ ఫలితాల్లో తగరపువలస విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ రమేష్

తగరపువలస: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం విడుదలైన డిగ్రీ పరీక్షా ఫలితాల్లో చిట్టివలస, తగరపువలస విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 5వ సెమిస్టర్ ఫలితాల్లో శ్రీబాసర డిగ్రీ కళాశాల విద్యార్థిని సరగడ సుజాత పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించగా, కమ్మకట్ల యువరాణి 9.8 గ్రేడ్ పాయింట్లు సాధించింది.

ఈ కళాశాల నుంచి 9 కంటే ఎక్కువ పాయింట్లు 69 మంది విద్యార్థులు సాధించగా వారిని గురువారం శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్, ప్రిన్సిపాల్ వీవీడీ రమేష్, సురేష్ తదితరులు అభినందించారు.

శ్రీకృష్ణా విద్యార్థినికి 9.43 పాయింట్లు

చిట్టివలస శ్రీకృష్ణా డిగ్రీ కళాశాలకు చెందిన పి.సునీతకు 9.43 పాయింట్లు లభించగా, ఉషశ్రీకి 9.37 పాయింట్లు లభించాయి. ఈ కళాశాల నుంచి 9 పాయింట్లకుపైగా 12 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో విద్యార్థులను చైర్మన్ బి.నరసింగరావు, ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ చిట్టిరెడ్డి అభినందించారు. సైన్స్‌లో 90 శాతం, బీకాంలో 95 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు.

'నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల నిర్వహణా?'

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘ సర్వసభ్య సమావేశం గురువారం విశాఖలో జరిగింది. ఏపీఎఫ్‌ఏకు అనుబంధంగా ఉన్న ప్రస్తుత 26 జిల్లాలకు గానూ 20 జిల్లాలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. కాగా.. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఎన్నిక నేపథ్యంలో శుక్రవారం తిరుపతిలో జరగనున్న సమావేశానికి ప్రస్తుత అధ్యక్షుడి హోదాలో హాజరుకావాల్సిందిగా బుధవారం మెయిల్ పంపారని ఏపీఎఫ్‌ఏ అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ తెలిపారు. రాష్ట్ర సమావేశాన్ని విశాఖలో గురువారం నిర్వహించేందుకు గతంలోనే నిర్ణయించామని గుర్తు చేశారు. ఏపీఎఫ్‌ఏకు రిజిస్టర్డ్ ఓటింగ్ కలిగిన వ్యక్తులు లేకుండా ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తుండడంపై మండిపడ్డారు. రాష్ట్ర స్థాయి ఎంపికలు చేసిన వారికి ఓటింగ్‌లో పాల్గొనే అర్హత లేకుండా సన్నాహాలు చేయడాన్ని తప్పుపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

బాల సదనంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ బాల సదనంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సూపరింటెండెంట్ కె.ప్రమీల గురువారం తెలిపారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సదనంలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు పిల్లలకు ప్రవేశం ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు లేని వారితోపాటు తల్లి లేని, తండ్రి లేని పిల్లలకు కూడా ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. జూన్ 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు 7893514460, 9848524446లో సంప్రదించాలని కోరారు.

ఆటో డ్రైవర్లు సహకరించాలి



పాత బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ లక్ష్మణమూర్తి

భీమునిపట్నం: భీమిలి ప్రాంతంలో ఆటో నడుపుతున్న డ్రైవర్లకు సీఐ లక్ష్మణమూర్తి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య చాలా ప్రాంతాల నుంచి గంజాయిని కొందరు ఆటోల ద్వారా సరఫరా చేస్తున్నారన్నారు. ఎవరైనా అనుమానాస్పద స్థితిలో ఏమైనా తరలిస్తుంటే తమకు వెంటనే సమాచారమివ్వాలని కోరారు. నేరాలకు పాల్పడిన వారు ఆటోలు ఎక్కితే వెంటనే తెలియజేయాలని కోరారు. ఎస్‌ఐ భరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'పాముకాటు బాధితునికి ప్రాణం పోశారు'

తగరపువలస: పాముకాటుకు గురై ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి వచ్చిన 45 ఏళ్ల బాధితుడు బంగారయ్యకు సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి వైద్యులు సకాలంలో వైద్యసేవలు అందించి పునర్జన్మ ఇచ్చారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలం రాజాపులోవకు చెందిన మొల్లి బంగారయ్య ఈ నెల 12న వేకువజామున 3 గంటలకు ఇంటి వద్ద పాముకాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు 5 గంటల ప్రాంతంలో ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే పాము విషం నరాల ద్వారా శరీరంలోకి ప్రవేశించడంతో కళ్లు వాలిపోవడం, మగతగా ఉండటం, శ్వాస తీసుకోవడం వంటి ఇబ్బందులను వైద్యులు గుర్తించారు. వెంటనే విరుగుడు మందులు ఇచ్చి కృత్రిమ శ్వాస అందించారు. బాధితుడు స్పృహలోకి రావడంతో కృత్రిమశ్వాస నిలిపివేసి జనరల్ వార్డుకు మార్చారు. ఈ సందర్భంగా గురువారం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ బంగారయ్యను కాటు వేసిన పాము ప్రమాదకరమైందన్నారు. మెరుగైన చికిత్స అందించిన హెచ్‌వోడీ కె.రామకృష్ణ, వైద్యులు పి.సాయిశేఖర్, ఎ.శ్రీనాథ్, పి.విద్యాధర్, ఎనస్థీషియన్ రాజేంద్రప్రసాద్‌ను అభినందించారు.

పాలిటెక్నిక్ ప్రవేశాల కమిటీలో గైస్ ప్రిన్సిపాల్

మురళీనగర్ (విశాఖ ఉత్తర): 2023 పాలిసెట్ అడ్మిషన్ కమిటీలో విశాఖపట్నం గవర్నమెంట్ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే వెంకటరమణకు అవకాశం కల్పించారు. పాలిటెక్నిక్‌లో చేరే అభ్యర్థుల ఎంపికలో ఈయన బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.

సిరుల తల్లికి సహస్ర తులసీపూజ



తులసీదళాల నడుమ కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం సహస్ర తులసీపూజ ఘనంగా నిర్వహించారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవ వర్ణార్చన లక్ష్మీహోమంలో ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు.

నేడు క్షీరాభిషేక సేవ : కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లిస్తే ఇద్దర్ని అనుమతిస్తారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

అదృశ్యమైన యువకుడి ఆత్మహత్య





మృతదేహం వద్ద విచారణ జరుపుతున్న సీఐ రామచంద్రరావు సిబ్బంది (ఇన్‌సెట్) దారయ్య (ఫైల్)

ఆనందపురం : మండలంలోని కోలవానిపాలెం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఇటీవల అదృశ్యం కాగా గురువారం గోరింట శివారులోని ఓ లేఅవుట్‌లో శవమై కనిపించాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... కోలవానిపాలెం గ్రామానికి చెందిన గంట్రెడ్డి దేముడు, మహాలక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం కాగా దారయ్య (26) ఆఖరివాడు. పదో తరగతి వరకూ చదువుకున్న దారయ్య పెందుర్తి మండలం గొరపల్లిలో ఓ యజమాని వద్ద జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి వివాహం కాలేదు. ఈ నెల 13న ఎప్పటిలాగే ద్విచక్ర వాహనంపై గొరపల్లి వెళ్లి విధుల్లో జాయిన్ అయ్యాడు. సాయంత్రం ఇంటికి ఫోన్ చేసి విధులు ముగించుకొని వస్తున్నానని సమాచారం ఇచ్చాడు. అనంతరం రాత్రి 8 : 30 గంటల ప్రాంతంలో మరలా ఇంటికి ఫోన్ చేసి పని ఉందని, ఇంటికి రావడం లేదని చెప్పాడు. అలా తెలిపిన దారయ్య మరుసటి రోజు ఉదయానికి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అతను పనిచేస్తున్న యజమానిని వాకబు చేశారు. 13న సాయంత్రమే పనిలో నుంచి వెళ్లిపోయినట్టు తెలపడంతో దారయ్య ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి చేసి ఉంది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో మండలంలోని గోరింట గ్రామంలోని కొండవాలు ప్రాంతంలో వేసిన లే అవుట్‌లో యువకుడి శవం పడి ఉండడాన్ని కొంతమంది గమనించి పోలీసులకు, గ్రామస్తులకు సమాచారం అందించారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అది దారయ్య మృతదేహంగా కుటుంబ సభ్యులు గుర్తించారు. సీఐ రామచంద్రరావు, ఏఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. ఘటనా స్థలంలో ఉన్న పురుగుల మందు డబ్బా, మద్యం సీసా, వాటర్ బాటిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో ఆన్ చేసి వివరాల సేకరణకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆత్మహత్యకు పాల్పడడానికి ముందు రోజున దారయ్య తన స్నేహితుడిని కలిసి తనకు తీవ్ర అనారోగ్యంగా ఉందని, ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని కోరినట్టు తెలిసింది. అనారోగ్య కారణాల వల్ల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి పొదుపు... రేపటికి మదుపు



విద్యార్థులకు పోస్టుకార్డులు అందజేస్తున్న బీపీఎం కృష్ణ

ఆనందపురం : నేడు మనం చేస్తున్న పొదుపు రేపటికి మదుపుగా ఉపయోగపడుతుందని ఆనందపురం బ్రాంచి పోస్టుమాస్టర్ ఎంఎస్‌హెచ్ కృష్ణ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం కథలు వినడం, చెప్పడం వంటి అంశాలతోపాటు, విద్యార్థులు – పొదుపు అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీపీఎం కృష్ణ మాట్లాడుతూ పొదుపు అలవర్చుకుంటే భవిష్యత్‌కు నిధి కింద ఉపయోగపడుతుందని వివరించారు. బాలికలకు సుకన్య పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం 25 మంది విద్యార్థులకు పోస్టుకార్డులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బీవీఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగి ఇంట తీవ్ర విషాదం



అప్పలరెడ్డి (ఫైల్)



అనారోగ్యంతో బాధపడుతున్న మృతుని తండ్రి రాము

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలస రెడ్డివీధికి చెందిన బోర అప్పలరెడ్డి (35) అనే ఆర్మీ ఉద్యోగి మహారాష్ట్రలోని పూణేలో తాను ఉంటున్న యూనిట్‌లో బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పన్నెండేళ్ల క్రితం ఆర్మీలో చేరిన అప్పలరెడ్డికి భోగాపురం మండలం చెరకుపల్లికి చెందిన యమునతో వివాహం జరిగింది. వీరికి 1, 2 తరగతులు చదువుతున్న కుమార్తెలతోపాటు మూడో కుమార్తె ఉన్నారు. మృతుని బంధువులకు అప్పలరెడ్డి ఆత్మహత్య విషయం తెలియడంతో గురువారం వేకువజామున విమానంలో హుటాహుటిన పూణే చేరుకున్నారు. సాయంత్రానికి ప్రత్యేక విమానంలో మృతదేహాన్ని పూణే ఎయిర్‌పోర్టు నుంచి విశాఖ తీసుకొచ్చారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనం ద్వారా రోడ్డు మార్గాన చిట్టివలసలోని ఇంటికి తీసుకొచ్చారు. అప్పలరెడ్డి మిత్రులు జాతీయ రహదారి నుంచి బాణసంచాతో ఊరేగింపుగా తోడ్కొని వచ్చారు.

రెండేళ్లుగా మంచంపైనే తండ్రి రాము..

అప్పలరెడ్డి తల్లిదండ్రులు అప్పయ్యమ్మ, రాములకు ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం. తండ్రి రాముకు అస్వస్థత కారణంగా రెండేళ్లుగా మంచానికే పరిమితమై ఉన్నాడు. మరే మగదిక్కు లేని కుటుంబంలో కొడుకు అప్పలరెడ్డి విగతజీవిగా, తండ్రి రాము అస్వస్థత కారణంగా మంచంపై ఉండటంతో చిట్టివలసలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇనాం రైతులకు పట్టాలివ్వాలి

తగరపువలస: భీమిలి మండలం నారాయణరాజుపేట పంచాయతీ ఇనాం రైతుల ఆందోళనల నేపథ్యంలో బీజేపీ భీమిలి కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు గురువారం ఆ పంచాయతీలో పర్యటించారు. ఏళ్ల తరబడి సాగులో రైతులు ఉండగా అప్పటి నుంచి ప్రభుత్వాలు వీరికి పాస్ పుస్తకాలు మంజూరు చేయలేదన్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు పంచాయతీలో ఇనాం భూములను సర్వే చేసి గ్రామ సచివాలయంలో జాబితా ప్రదర్శించారన్నారు. రైతుల సాగులో ఉన్న భూములను లోపాయికారీగా బడా రైతులు రూ.14 కోట్లకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు జీపీఏ రిజిస్ట్రేషన్ చేశారన్నారు. 400 మంది రైతులకు చెందిన రూ.500 కోట్ల విలువైన భూములను సాగులో ఉన్న రైతుల పేరుతో పట్టాలు ఇవ్వాలని రామానాయుడు డిమాండ్ చేశారు. రికార్డులు తారుమారు చేసిన రెవెన్యూ అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరుపయోగంగా సోలార్ వాటర్ హీటర్



మధురవాడ పీహెచ్‌సీ మేడపై ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్

మధురవాడ: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల సౌకర్యార్థం మధురవాడ పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్ కొన్నేళ్లుగా మూలకు చేరింది. వైద్యుల నిర్లక్ష్యం, ఆకతాయిలకు ఆస్పత్రి భవనాలు, మేడలు అడ్డాగా మారడంతో వస్తువులకు రక్షణ కరువైంది. ఇక్కడ ప్రసూతి సేవలు ఎక్కువగా అందిస్తుండడంతో వేడి నీరు చాలా అవసరమని ఎనిమిదేళ్ల క్రితం దాతల సహకారంతో సోలార్ వాటర్ హీటర్‌ను పీహెచ్‌సీ మేడపై ఏర్పాటు చేశారు. అనంతరం కొన్నాళ్లు సక్రమంగానే నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సామగ్రి మూలకు చేరింది. వాటర్ ట్యాంకు నుంచి హీటర్‌కు నీరు వెళ్లే ఇతర పైప్‌లైన్ కూడా పూర్తిగా ధ్వంసమైంది. దీంతో చాలా వరకు నీరు మేడపైనే లీకైపోయి వృథా అయిపోవడంతో పీహెచ్‌సీ మేడ కూడా చిందరవందరగా తయారౌతోంది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సోలార్ వాటర్ హీటర్‌ని వినియోగంలోకి తీసుకురావాలని, భవనాలు దెబ్బతినకుండా చర్యలు చేపట్టాలని రోగులు, స్థానికులు కోరుతున్నారు.